క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి



రుద్రాక్షపల్లి ఆరోగ్య సిబ్బందితో డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.సీతారాం

సత్తుపల్లిరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సీతారాం వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని రుద్రాక్షపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని గంగారం, లంకాసాగర్ వైద్యాధికారులు చింతా కిరణ్‌కుమార్, అవినాష్‌లతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఎ.పద్మ, కె.మంజుల, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఏన్కూరు: మండల వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళల నడుమ గ్రామంలో స్వామివానిక ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నియామకం



తాజుద్దీన్

కారేపల్లి: కారేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా తాజుద్దీన్‌ను నియమిస్తున్నట్లు జిల్లా కమిటీ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయని మండల కాంగ్రెస్ తలారి చంద్రప్రకాశ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల తెలిపారు. ఈ సందర్భంగా షేక్ తాజుద్దీన్ మాట్లాడుతూ.. మండలంలో మైనార్టీల సమస్యలను కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాజుద్దీన్ నియామకం పట్ల కారేపల్లి పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు టోనీవీరప్రతాప్, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్, ఓంప్రకాశ్‌బాబ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కిష్టారంలో ఓసీలో ఏఐటీయూసీ సంబురాలు

సత్తుపల్లిరూరల్: సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికైన సందర్భంగా స్థానిక కిష్టారం సమంత, ఓసీ క్యాంప్‌లలో ఏఐటీయూసీ కార్మికులు శుక్రవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సముద్రాల సుధాకర్, భరణి, సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. కార్మికుల పరిరక్షణే ధ్యేయంగా ఏఐటీయూసీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, నాగేశ్వరరావు, కిషోర్, శ్రీనివాస్, కృష్ణ, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

కమల్‌రాజ్ పరామర్శ

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకులు వంకాయలపాటి లచ్చయ్యను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ శుక్రవారం పరామర్శించారు. లచ్చయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కమల్‌రాజ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాగులవంచ రైల్వే కాలనీ సర్పంచ్ యలమంద, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, వెంకటి, రామారావు, మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మధిరరూరల్: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో శుక్రవారం మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. వెలిశెట్టి శ్రీను, ఆదిలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

9 వరకు చెరకు క్రషింగ్ గడువు

కల్లూరు: కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు సంబంధించి వచ్చే నెల 9వ తేదీ కల్లా చెరకు క్రషింగ్ పూర్తి కానున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగుల్ల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యాక్టరీ పరిధిలో అగ్రిమెంట్ చేసుకున్న చెరకు రైతులందరూ సకాలంలో చెరకును ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. చెరకు నరకడం మొదలు పెట్టని రైతులు వెంటనే ఫ్యాక్టరీ సిబ్బంది ద్వారా పర్మిట్లు పొంది క్రషింగ్ సీజన్‌ను విజయవంతంగా పూర్తిచేయాలని రైతులకు సూచించారు.

ఈ–కేవైసీ కోసం బారులు

- గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్న ప్రజలు
- పహారా నిర్వహిస్తున్న పోలీసులు



ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది



సత్తుపల్లి ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు దీరిన వినియోగదారులు

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం ప్రకటించిన రూ.500లకే రాయితీ గ్యాస్ పథకం కోసం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల ముందు ఈ-కేవైసీ కోసం బారులు తీరుతున్నారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఇంకా విధి విధానాలు ప్రకటించకముందే ప్రజలు ఈకేవైసీ చేసుకుంటేనే రాయితీ వర్తిస్తుందనే ప్రచారంతో గ్యాస్ కంపెనీ కార్యాలయాల వద్ద భారీగా చేరుకొని క్యూ కడుతున్నారు.

పహారా నిర్వహిస్తున్న పోలీసులు..

సత్తుపల్లిలోని ఇండెన్ గ్యాస్ కంపెనీ కార్యాలయాల వద్ద డివిజన్‌లోని నాలుగు మండలాల నుంచి వినియోగదారులు భారీగా చేరుకోవటంతో పోలీసుల పహారా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఎప్పటి నుంచో ఈ–కేవైసీ చేసుకోవాలని గ్యాస్ ఏజెన్సీలు చెబుతున్నా వినియోగదారులు పట్టించుకోలేదు. ప్రభుత్వం ప్రకటించిన గ్యాస్ పథకానికి రాయితీ వర్తిస్తుందోలేదోనని పరుగులు తీస్తున్నారు.

ఈ–కేవైసీ కోసం..

ఈ–కేవైసీ కోసం వేలిముద్ర తప్పనిసరి, ఎవరి పేరుమీద అయితే గ్యాస్ నమోదు అయి ఉంటే వారే ఏజెన్సీల వద్దకు వెళ్లి వేలిముద్రవేసి తన సెల్ ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలి. ఆధార్‌కార్డు, గ్యాస్ పాస్‌పుస్తకంతో వెళ్తితే గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో ఈకేవైసీ చేస్తున్నారు.

అపోహలు నమ్మొద్దు..



గ్యాస్ పథకానికి ఈకేవైసీ తప్పనిసరి అనే నిబంధనలు ఏమీ ప్రభుత్వం నుంచి రాలేదు. ప్రజలు అపోహలు, పుకార్లు నమ్మొద్దు. వినియోగదారుడి ఇంటి వద్దకే వచ్చి ఈకేవైసీ చేస్తాం. దీనికి ఆఖరి గడువు అంటూ ఏమీలేదు. ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎలాంటి నియమ నిబంధనలు ఇంకా రాలేదు.

– వందనపు సత్యనారాయణ, ఇండెన్‌గ్యాస్ నిర్వాహకుడు, సత్తుపల్లి

పట్టణ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్
- వైరా మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పట్టణ ప్రాంత అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి సారించారని ఆ దిశగా నిధుల మంజూరుకు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన పట్టణ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతీ లబ్ధిదారుడికి చేరేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, ఇన్‌చార్జ్ కమిషనర్ కరుణాకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కె.మహాలక్ష్మి

కొణిజర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గోసు మధు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వ్యవసాయ, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలో ప్రజాపాలన గ్రామసభలు జరగుతున్నందున ఆయా గ్రామ సభలకు మండలస్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉన్నందున సమావేశం ముగిస్తున్నట్లు తెలిపారు. కొత్త ప్రభుత్వ పాలనలో అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నారు. అనంతరం సభ్యులు ఏకగ్రీవ ఆమోదంతో సభను ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన 'ప్రజాపాలన'

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం ఇందిరమ్మ అభయహస్తం పేరిట నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యాన పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కేంద్రాలను సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి, ప్రజలకు పలు సూచనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కొణిజర్ల: లక్ష్మీపురంలో.. అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్



వైరా: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్



మధిర: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లత, కమిషనర్ రమాదేవి



తల్లాడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి



కారేపల్లి: మాట్లాడుతున్న నాయిబ్ తహసీల్దార్ లక్ష్మి



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

నేటి ప్రజాపాలన సభలు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాల్టీలో శనివారం ఉదయం 7వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీ, 18వ వార్డులో వెంకటేశ్వరటాకీస్ రోడ్‌లోని డాల్ఫిన్ స్విమ్మింగ్‌పూల్ ప్రాంగణం, 8వ వార్డులోని ఎన్టీఆర్‌నగర్ కమ్యూనిటీహాల్, 9వ వార్డులోని పాత ఆరోగ్య ఉపకేంద్రం వెనుక ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించబడతాయని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత తెలిపారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించబడతాయని ఎంపీడీఓ జయరాం తెలిపారు

ఎర్రుపాలెం మండలంలో..

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం, గట్లగౌరారం, పెద్దగోపవరం, అయ్యవారిగూడెం గ్రామాల్లో నేడు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు గ్యారంటీల పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోనికొదుమూరురుకు చెందిన 20ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఇంటి నుంచి గురువారం వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమాకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ముదిగొండలో ఈజీఎస్ సోషల్ ఆడిట్

ముదిగొండ: ముదిగొండలోని స్త్రీశక్తి భవనంలో శనివారం 25గ్రామ పంచాయతీల్లో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై సమగ్ర ఆడిట్ నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీఓ రంగనాయకమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల కూలీలు, మేట్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రజావేదికకు హాజరు కావాలని కోరారు.

నేడు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా

ఏన్కూరు: నేడు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం హరినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పాస్‌లతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డిలక్స్ బస్సులలో ప్రయాణం చేయవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాస్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. బస్సు పాస్‌లు అయ్యే ఖర్చును ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన జాగర్లముడి సురేష్ పెట్టుకున్నట్లు తెలిపారు.

డాక్టర్ శెట్టిపల్లికి సన్మానం



శెట్టిపల్లి నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

ఏన్కూరు: విద్యార్థుల సౌకర్యార్థం ఏన్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నారాయణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు బోరు, విద్యుత్‌మోటర్ అందించాడు. దీంతో ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వరరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కుర్చీలు వితరణ



కుర్చీలు వితరణ చేసిన దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు గ్రామానికి చెందిన దాత, కాంగ్రెస్ నాయకులు గూడూరు నర్సింహారెడ్డి తన కుమారుడు మోహిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి 25 కుర్చీలను వితరణ చేశారు. వీటిని స్థానిక సర్పంచ్ సగ్గుర్తి రాజేశ్వరి, ఎంపీటీసీ సగ్గుర్తి కిశోర్ చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్ నాగరత్నంకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ వెంకటరమణ, నాయకులు సగ్గుర్తి వెంకట్ నారాయణ, లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లేపల్లి సీతమ్మ, బాబురావు, నాగబ్రహ్మాచారి, రిషిక, నంద్రు వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, రాజేష్, శ్రవణ్‌కుమార్, బాలు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వం



సత్తుపల్లిటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలని ప్రజలు ఆకాంక్షించినట్లుగానే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మున్సిపాల్టీలోని 3, 4, 12, 14వ వార్డులతో పాటుగా.. పెనుబల్లి మండలంలోని పాత కుప్పెనకుంట్ల గ్రామాల్లో శుక్రవారం జరిగిన ప్రజాపాలన సభల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల పథకాలను వందరోజుల్లో అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజాపాలన గ్రామ సభల ద్వారా ప్రజలందరికీ ప్రజా సంక్షేమ పథకాలు అందేలా అధికారులంతా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, కౌన్సిలర్లు రాంబాబు, నాగుల్‌మీరా, పద్మజ్యోతి, మౌలాలీ, ప్రసాద్, ఎండీ సలీమాఖాతూన్, రఘు, సొసైటీ ఉపాధ్యక్షుడు చెన్నారావు, కమల్‌పాషా, నాగభూషణం, ఎండీఓ జయరాం, ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరికలు..

సత్తుపల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్‌ల సమక్షంలో కల్లూరు మండలానికి చెందిన మిషన్ భగీరథ సబ్ డివిజన్ కార్మికులు శుక్రవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రభాకర్ చౌదరి, బత్తిన నగేష్, అలీ, నర్సింహారావు, తిరుపతిరావు, సోమయ్య, షబ్బీర్ అలీ, బాలాజీ, ప్రభాకర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన జగన్నాథపురం రైతులు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను శాలువాతో సత్కరిస్తున్న జగన్నాథపురం రైతులు

చింతకాని: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను మండలంలోని జగన్నాథపురం గ్రామ రైతులు హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈము కోళ్ల పెంపకంతో తాము ఆర్థికంగా చాలా నష్టపోయామని, ఈము కోళ్ల రైతులకు కూడా రుణమాఫీని వర్తింపచేయాలని భట్టి విక్రమార్కను కోరారు. అలాగే వారసత్వంగా ఉన్నటువంటి వ్యవసాయ భూములకు కూడా పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదని తెలిపారు. తుమ్మలమ్మ చెరువు వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించాలని భట్టి విక్రమార్కను కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు గోవిందరావు, అప్పారావు, పుల్లయ్య, కిషన్‌రావు, మురళి, హరీష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



లిటిల్ ఫ్లవర్ చర్చిలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైరా: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం వైరాలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత గురువులదే అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, హరనాథ్, పీఆర్‌టీయూ నాయకులు నరసింహారావు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సైదయ్య, దయాకర్, ఐజాక్, రామచంద్రయ్య, పుల్లారావు, సుజాత, అహల్య, కళావతి పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ చర్చిలో..

కల్లూరు: కల్లూరు లిటిల్ ఫ్లవర్ చర్చిలో శుక్రవారం ఫాదర్ సురేష్ జోష్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో ఏసు క్రీస్తు దీవెనెలు దారలంగా కురిపించాలని, ప్రతి ఒక్కరూ సంతోషాలతో ఉండాలని, నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ అన్ని శుభాలు కలగాలని ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. ఈ క్యాలెండర్లను ప్రతీ ఒక్క కతోలిక క్రైస్తవ కుటుంబానికి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిస్టర్ సిబిల్, ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు, జొన్నలగడ్డ కృష్ణయ్య, దామాల ప్రసాద్, ముత్తమాల సురేష్, దామాల రాజు, ప్రభాకర్‌రావు, ఉబ్బన బాబూరావు, కిషోర్, ఉబ్బన నగేష్, హారోను, ఉబ్బన రఘు, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

చింతకాని: సీపీఐ 99వ వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలో శనివారం నిర్వహించే పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని బస్వాపురం, నేరడ, నాగిలిగొండ, ప్రొద్దుటూరు, కోమట్లగూడెం గ్రామాల్లో శుక్రవారం కార్యకర్తల సమావేశాలను నిర్వహించి మాట్లాడారు. ముందుగా ఫెవిలియన్ గ్రౌండ్ నుంచి ఇందిరానగర్ వరకు రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతును నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మోహన్‌రావు, మండల సహాయ కార్యదర్శి గోపాలరావు, మహేష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ పట్టాలెక్కేనా?

- డిప్యూటీ సీఎం భట్టిపైనే స్థానికుల ఆశలు
- రేమిడిచర్లలో 60 ఎకరాల కేటాయింపు
- ఆతర్వాత పురోగతి లేక యువత ఎదురుచూపులు



రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్కు కోసం కేటాయించిన భూమి

ఎర్రుపాలెం: ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మండలంలోని రేమిడిచర్ల సమీపాన సర్వే నంబర్ 372(రమణబీడు భూమి)లో 60 ఎకరాల భూమిని కేటాయించగా ఆతర్వాత ఎలాంటి పురోగతి లేక స్థానిక యువత ఎదురుచూస్తున్నారు. తాజాగా మధిర నుంచి గెలిచిన మల్లు భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎంగా పదవి దక్కిన నేపథ్యాన ఆయన ఇచ్చిన హామీ మేరకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం జరుగుతుందని ఆశిస్తున్నారు. ఏళ్ల క్రితం భూమి కేటాయించినా నిధులు విడుదల చేయకపోవడంతో భూమి పడావుగా మిగిలిపోయి ఆక్రమణకు గురవుతోంది.

డ్రైపోర్ట్ నిర్మాణానికి అనుకూలం

రేమిడిచర్లలో కేటాయించిన భూమిలో డ్రై పోర్ట్ నిర్మాణానికి అనుకూలమైన పరిస్థితులున్నాయి. తద్వరా ఇక్కడ నుండి ఏపీ రాష్ట్రం మచిలీపట్నం, వైజాగ్, తదితర ప్రాంతాలకు సరుకుల రవాణాకు వీలవుతుంది. ఈ భూములకు ఆనుకునే కాజీపేట–విజయవాడ ప్రధాన రైలు మార్గం ఉండడం మరో అనుకూలతగా చెబుతున్నారు. కాగా, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కాకపోకగా ఎలాంటి పరిశ్రమలు లేకపోవడంతో బనిగండ్లపాడు, ఎర్రుపాలెం, రేమిడిచర్ల, కొత్తపాలెం, మీనవోలు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా వీరులపాడు మండలం నర్సింహారావుపాలెంలోని ఫ్యాక్టరీలకు కొందరు, కొండపల్లి, విజయవాడ తదితర పట్టణాల్లో భవన నిర్మాణ కూలీలుగా మరికొందరు వెళ్తున్నారు. ఇక్కడే పరిశ్రమలు ఏర్పాటైతే వారికి సొంత మండలంలోనే ఉపాధి లభిస్తుందని, ఈ దిశగా డిప్యూటీ సీఎం భట్టి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పార్క్‌తో నిరుద్యోగులకు ఉపాధి

మధిర నియోజకవర్గంలో నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నందున ఇండస్ట్రియల్ పార్కు నిర్మిస్తే వారికి మేలు జరుగుతుంది. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే భట్టి ప్రభుత్వంలో కీలకంగా ఉండడం .. జిల్లాకే చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు సైతం మంత్రి పదవు లుదక్కడంతో స్థానికుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. గత పదేళ్ల క్రితం ఇచ్చిన హామీ నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.